సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




బుధవారం 01 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 303 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



## హైదరాబాద్ ట్యాంక్‌బండ్ హీరో శివకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక సాయం

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 01, ప్రతినిధి: హైదరాబాద్ హుస్సేన్ సాగర్ (ట్యాంక్‌బండ్) లో అనేక మంది ప్రాణాలను రక్షించిన శివకు ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. అలాగే, శివ కుమారుడు వేణుమాధవ్‌కు హోమ్ గార్డ్ ఉద్యోగానికి నియామకపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి గారు, ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడిన శివ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకొని సహాయం చేయాలని అధికారులకు ఆదేశించారు. వీటితో పాటు, ఉపాధి కోసం ట్యాంక్‌బండ్ సమీపంలో స్విమ్మింగ్ పూల్ నిర్మాణం, శివ కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని కూడా ఆదేశాలు జారీ చేయగా, శివ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి గారి సహృదయమైన స్పందనకు కృతజ్ఞతలు తెలిపారు.




## రాజకీయాలకు అతీతంగా మానవత్వం – సోనియా గాంధీని పరామర్శించిన ప్రధాని నరేంద్ర మోదీ

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 1, ప్రతినిధి: రాజకీయాలు వేరు, మానవత్వం వేరు అన్న సందేశాన్ని ప్రతిబింబిస్తూ భారత ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ ఆరోగ్యం బాగోలేదని తెలుసుకొని వెళ్లి పరామర్శించారు. దేశ రాజకీయాల్లో పరస్పర విమర్శలు కొనసాగుతున్నప్పటికీ వాటిని పక్కనబెట్టి మానవత్వాన్ని ముందుకు తీసుకువచ్చిన ఈ చర్య విశేష ప్రశంసలు అందుకుంటోంది. ప్రజా సేవలో బాధ్యతగల నాయకుడిగా వ్యక్తిత్వాన్ని నిలబెట్టే విధంగా మోదీ వ్యవహరించిన తీరు రాజకీయాలకు అతీతంగా ఆదర్శంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితి త్వరగా మెరుగుపడాలని దేశ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.



## కేరళ శాసనసభ ఎన్నికల్లో యూడిఎఫ్ సీన్చరీ ఖాయం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధీమా

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 01, ప్రతినిధి: కేరళలో జరగనున్న అత్యంత ప్రతిష్టాత్మక శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూనైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (UDF) మొత్తం 140 సీట్లలో 100కు పైగా సీట్లు గెలుచుకుంటాయని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచారం పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు మంగళవారం వ్యక్తం చేశారు. ఆయన ఆడూరు, అరుణ్ ములని నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహిస్తూ గతంలో వయనాడ్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన రాహుల్ గాంధీ, రాష్ట్రంలోని మహిళలను చైతన్యపరుస్తున్న కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ ప్రచారం కారణంగా ఈసారి యూడిఎఫ్ విజయానికి పరిస్థితులు సుసిద్ధమని తెలిపారు. గత పదేళ్లలో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (LDF) విఫలమవడం, బిజెపీ నేతృత్వంలోని NDA ను ప్రజలు తిరస్కరించడం కేరళలో UDF మాత్రమే అభివృద్ధి పథంలో ముందుకు నడిపించగలదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఉచిత బస్సు పథకం మహిళల ఆర్థిక, సామాజిక భద్రతకు బలమైన అడుగు



సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 01, ప్రతినిధి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఉచిత బస్సు పథకాన్ని మహిళల ఆర్థిక, సామాజిక భద్రతకు, స్వావలంబనకు బలమైన అడుగుగా పేర్కొన్నారు. మంగళవారం సూర్యాపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద మహాలక్ష్మి పథకంలో భాగంగా ఈ పథకం ద్వారా సుమారు రూ.10 వేల కోట్ల ఆర్థిక ఆదా సాధించబడిన సందర్భంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2023 డిసెంబరులో ప్రారంభమైన ఈ పథకం ద్వారా 290 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసి, తమ రోజువారీ ఖర్చులను ఆదా చేసి, ఆ డబ్బును కుటుంబ అవసరాలు, విద్య, ఆరోగ్య కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని కలెక్టర్ వివరించారు. మహిళలు నెలకు సగటున రూ.5,000 వరకు ఆదా చేస్తున్నారని, పథకం వారి ఆర్థిక భద్రతకు పునాది వేసిందని అన్నారు. అంతేకాక, ప్రభుత్వం మహిళలకు వ్యాపార అవకాశాలు, బ్యాంకు రుణాల ద్వారా ఆర్థిక బలోపేతం కల్పిస్తున్నందున, ఉచిత బస్సు పథకం కుటుంబాభివృద్ధికి, సామాజిక ప్రగతికి దోహదమని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మోరిశెట్టి నివేదిత, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, ఆర్డీవో వేణు మాధవ రావు, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం సూచరిత, అదిషనల్ డీఆర్డీవో సురేష్, సూర్యాపేట ఆర్టీసీ డిఎం సునీత, కౌన్సిలర్ అరుణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## వసంతోత్సవాల కారణంగా ఏప్రిల్ 01వ తేదీన పౌర్ణమి గరుడసేవ రద్దు – భక్తులకు సూచన

సందేశం టైమ్స్, తిరుమల, ఏప్రిల్ 01, ప్రతినిధి: తిరుమల వసంత ఉత్సవాల ప్రారంభోత్సవాల భాగంగా మంగళవారం శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీవారి స్నపన తిరుమంజనం వైభవంగా జరిగింది. ఉదయం 2 గంటల నుండి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, టీటీడీ ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. వసంత ఉత్సవాల కారణంగా ఏప్రిల్ 01, 2026న జరిగే పౌర్ణమి గరుడసేవను ఈసారి రద్దు చేసినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి వారి పూజా కార్యక్రమాలను అంతర్బద్ధంగా నిర్వహించుకోవాలని సూచించారు.

## ఓటింగ్ బాధ్యత, బీసీ ఉద్యోగుల సంక్షేమం, మహిళా హక్కుల కోసం మల్లన్న మద్దతు



సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 01, ప్రతినిధి: శాసన మండలిలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రజల మధ్య ఓటు హక్కు బాధ్యతను గుర్తుచేసి "ఓటు వేయని వారికి ఓటు హక్కు ఎందుకు?" అని ప్రశ్నించారు. ఆయన తెలిపారు, చదువు లేని వ్యక్తులు కూడా ఓటు వేస్తున్నారని, చదువున్నవారు బాధ్యతను మరిచిపోవడం ప్రజాస్వామ్యంలో సమస్య అని. వరుస మూడు సార్లు ఓటు వేయని వారి ఓటును రద్దు చేయాల్సిందని, ఓటింగ్‌కు దూరంగా ఉండటం అభ్యర్థులను సరైన విధంగా ఎంచుకునే అవకాశాన్ని ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు.ఇంకా తీన్మార్ మల్లన్న తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కుషాయిగూడ డిపో సమావేశానికి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా హాజరై, బీసీ ఉద్యోగుల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఉద్యోగ భద్రత, పదోన్నతులు వంటి అంశాలను చర్చించారు.ఉద్యోగుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చి, రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఆయన ఉద్యోగుల ఐక్యత, అంకితభావాన్ని ప్రోత్సహిస్తూ, ఏ కష్ట సమయంలోనైనా పూర్తి బాధ్యత తనదని తెలిపారు.మరియూ, మహిళల హక్కుల కోసం పోరాటం చేసిన సావిత్రి భాయి పూలే కథనాన్ని గుర్తుచేసి, ఆయన ధైర్యం వల్ల నేడు మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా అవకాశాలు పొందుతున్నారని వెల్లడించారు.

# ఏప్రిల్ 6న హైదరాబాద్‌లో గద్దర్ ఫౌండేషన్ రాష్ట్ర స్థాయి సభ – విజయవంతం చేయాలని ప్రజా సంఘాల పిలుపు



హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి: ప్రజా యుద్ధ నౌక గద్దర్ స్మారకార్థం గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 6న హైదరాబాద్‌లో నిర్వహించనున్న "ప్రశ్నించే గొంతులు సాధించిన విజయాలు" రాష్ట్ర స్థాయి సభను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని అమరవీరుల స్థూపం వద్ద ఈ సభకు సంబంధించిన పోస్టర్‌ను తెలంగాణ జేఏసీ జిల్లా కన్వీనర్ వై అశోక్ కుమార్, రిటైర్డ్ ప్రిన్సిపల్ అనంతయ్య, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, డీవీఎంసీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య, పంబల్ల దుర్గాప్రసాద్‌లు కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గద్దర్‌పై కాల్పులు జరిగిన రోజును పురస్కరించుకుని ప్రతి సంవత్సరం గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ సభను నిర్వహిస్తున్నామని, దీనిని గద్దర్ పునర్జన్మ దినంగా పాటిస్తున్నట్లు వివరించారు. ఏప్రిల్ 6న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ సభకు ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఆర్ లక్ష్మి, నాగరాజు, నందకిషోర్, పోచయ్య, బంగారు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# నిరుపేద కుటుంబానికి అండగా జీఎంఆర్ ఫౌండేషన్ నిత్యవసర సరుకుల పంపిణీ

సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 1, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం కృష్ణాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద యునుస్ కుటుంబానికి జీఎంఆర్ ఫౌండేషన్ అండగా నిలిచి మానవతా దృక్పథాన్ని మరోసారి చాటుకుంది. ఇటీవల ఆ కుటుంబంలో జరిగిన విషాదాన్ని తెలుసుకున్న ఫౌండేషన్, వారి ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నెలకు సరిపడా నిత్యవసర సరుకులను అందజేసింది. ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గుబ్బపు మచ్చేందర్ ఆదేశాల మేరకు ఈ సహాయం అందించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఫౌండేషన్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో కృష్ణాపూర్ మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆకుల రాములు, కుసంగి లక్ష్మయ్య, ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాస్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్య, పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి – పాఠశాలలు, అంగన్వాడీలపై కలెక్టర్ సమగ్ర తనిఖీ





సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 1, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్య సూచించారు. జిల్లాలో విద్యా, శిశు సంక్షేమ సేవల అమలును సమీక్షించే భాగంగా కొండాపూర్ మండలం గుంతపల్లి గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆమె, ప్రాథమిక పాఠశాల మరియు అంగన్వాడి కేంద్రంలో వసతులు, సేవల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు. తరగతి గదులు, పరిశుభ్రత, త్రాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను తనిఖీ చేయడంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు గుడ్డు, పౌష్టికాహారం అందుతున్నదా అని ఆరా తీసి, చిన్నారుల శారీరక–మానసిక అభివృద్ధికి సరైన పోషకాహారం అవసరమని పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మోనిన్ పరిశ్రమను సందర్శించి భద్రతా చర్యలను పరిశీలించి యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో తహసిల్దార్ అశోక్, ఎంపీడీవో వేణుగోపాల్, సర్పంచ్ అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 2 నుంచి గ్రామసభలు – 99 రోజుల కార్యాచరణ విజయవంతం చేయాలి: కలెక్టర్ ప్రవీణ్య ఆదేశం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 1, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఏప్రిల్ 2 నుండి జిల్లాలో నిర్వహించనున్న గ్రామసభలకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్య మండల పరిషత్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన వీడియో సమీక్షలో గ్రామసభలను ఉదయం 10 గంటలకు ప్రారంభించి, లబ్ధిదారుల ఎంపిక వివరాలు ముందుగానే సిద్ధం చేసి, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ, ధాన్యం కొనుగోలు, రేషన్ కార్డులు, చేయూత, మహాలక్ష్మి, గృహ జ్యోతి, మహిళా శక్తి, ఎస్‌హెచ్‌జీ రుణాలు, ఉపాధి హామీ పనులు వంటి పథకాల వివరాలు సిద్ధంగా ఉంచాలని, త్వరలో అమలు కానున్న ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం గురించి కూడా వివరించాలని తెలిపారు. గ్రామసభలలో మహిళలు, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడంతో పాటు వేసవి దృష్ట్యా తగిన ఏర్పాట్లు చేయాలని, ప్రచారాన్ని దండోరా, పోస్టర్ల ద్వారా విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. కొత్త దరఖాస్తుల కోసం ప్రత్యేక కౌంటర్లు, ఫీడ్‌బ్యాక్ బాక్స్‌లు ఏర్పాటు చేసి, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచిస్తూ, జిల్లా అధికారులు స్వయంగా గ్రామపంచాయతీలకు హాజరై పర్యవేక్షించాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# సంగారెడ్డిలో పోలీస్ యాక్ట్ 30, 30(ఎ) అమలు అనుమతి లేకుండా నిరసనలకు నో

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 1, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలను పరిరక్షించే లక్ష్యంతో ఏప్రిల్ 1 నుండి 30 వరకు నెలరోజుల పాటు పోలీస్ యాక్ట్ 30, 30(ఎ) అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ వెల్లడించారు. ఈ కాలంలో ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించడం, ప్రజాధనానికి నష్టం కలిగించే చర్యలు చేపట్టడం వంటి చట్టవిరుద్ధ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు పూర్తి సహకారం అందించి శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎస్పీ కోరారు.

# పదవీ విరమణ సహజం – సేవలు చిరస్మరణీయం: ముగ్గురు పోలీసు అధికారులకు ఘన వీడ్కోలు





సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 1, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ అనేది సహజమని, అయితే సేవలు మాత్రం చిరస్మరణీయంగా నిలుస్తాయని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన మొగులయ్య (ఎస్ఐ), సయ్యద్ ఖదీరుద్దీన్ (ఆర్ఎస్ఐ), శ్రీనివాస్ రెడ్డి (పీసీ)లకు ఘన సత్కారం చేసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొగులయ్య 1987లో కానిస్టేబుల్‌గా చేరి నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ధైర్యసాహసాలతో విధులు నిర్వహిస్తూ అంచెలంచెలుగా ఎదిగి ఎస్ఐగా సేవలందించారని తెలిపారు. సయ్యద్ ఖదీరుద్దీన్ 1983లో ఆర్మ్డ్ రిజర్వ్‌లో చేరి క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ఆర్ఎస్ఐ స్థాయికి ఎదిగారని, శ్రీనివాస్ రెడ్డి 1993లో పోలీసు శాఖలో చేరి సాధారణ విధులు, రైల్వే సేవల్లో సమర్థవంతంగా పనిచేసి అధికారుల ప్రశంసలు అందుకున్నారని కొనియాడారు. ముగ్గురు అధికారుల సేవలు పోలీసు శాఖకు మారువలేనివని పేర్కొంటూ, రిటైర్మెంట్ అనంతరం వారికి రావలసిన అన్ని ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం వారి ఆయురారోగ్యాలు కోరుతూ కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ. కళ్యాణి, ఎఆర్ డీఎస్పీ నరేందర్, ఇన్స్పెక్టర్లు కిరణ్ కుమార్, సదా నాగరాజు, ప్రవీణ్ రెడ్డి, నాగేశ్వర్ రావు, ఆర్ఐలు రాజశేఖర్, డానియెల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# బ్యాంకు లాకర్లలోని వస్తువుల తనిఖీ నిబంధనల ఉల్లంఘనే: నిర్మలా సీతారామన్

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రతినిధి: బ్యాంకు లాకర్లలో వినియోగదారులు భద్రపరిచే విలువైన వస్తువులను బ్యాంకులు చూడడం, రికార్డు చేయడం నిబంధనలకు విరుద్ధమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. లాకర్లలో ఉంచిన వస్తువుల గోప్యతను కాపాడటం బ్యాంకుల బాధ్యత అని పేర్కొన్నారు. లాకర్లలోని వస్తువుల బీమా కవరేజీపై స్పందించిన ఆమె, వస్తువుల విలువ ఆధారంగా బీమా ఉంటుందనే అభిప్రాయాన్ని ఖండించారు. రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం దొంగతనం, అగ్నిప్రమాదం, మోసం వంటి సందర్భాల్లో నష్టం జరిగితే బ్యాంకులు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సాధారణంగా లాకర్ వార్షిక అద్దెకు 100 రెట్లు వరకు పరిహారం అందుతుందని పేర్కొన్నారు. అయితే లాకర్లలోని వస్తువులను బ్యాంకులు తనిఖీ చేయలేకపోవడం వల్ల వాటి అసలు విలువ ఆధారంగా పరిహారం నిర్ణయించడం సాధ్యం కాదని వివరించారు. ప్రస్తుతం లాకర్ బీమా కవరేజీకి సంబంధించి కొత్త ప్రతిపాదనలు పరిశీలనలో లేవని మంత్రి తెలిపారు.

## గ్రేస్ ఓల్డ్ ఏజ్ హోమ్, భరోసా కేంద్రాల తనిఖీ – బాధితులకు తక్షణ న్యాయ సహాయం అందించాలి: సౌజన్య



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 1, ప్రతినిధి: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ చంద్ర మార్గదర్శకత్వంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య సంగారెడ్డిలోని గ్రేస్ ఓల్డ్ ఏజ్ హోమ్ మరియు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భరోసా కేంద్రానికి వచ్చే బాధితులకు తక్షణమే న్యాయ సలహాలు, సహాయం అందించాలని, పోక్సో చట్టం సహా మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. లైంగిక నేరాలకు పాల్పడేవారిపై కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే వృద్ధుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టి వారి ఆరోగ్యం, సంక్షేమం పట్ల శ్రద్ధ వహించాలని, కేంద్రాల పరిశుభ్రతను కాపాడాలని ఆదేశించారు. బాధితుల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, న్యాయ సమస్యలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో భరోసా కేంద్రం, ఓల్డ్ ఏజ్ హోమ్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## తెలంగాణ పంచాయతీలకు కేంద్రం రూ.247 కోట్ల నిధులు – గ్రామాభివృద్ధికి ఊతం

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ అందించింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ 2025-26 ఆర్థిక సంవత్సరానికి తొలి విడతగా రూ.247.94 కోట్ల అన్‌టైడ్ గ్రాంట్స్‌ను విడుదల చేసింది. ఈ నిధులు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12,600 గ్రామ పంచాయతీలకు నేరుగా చేరి, గ్రామసభలు నిర్ణయించే ప్రాధాన్యత పనులకు వినియోగించే అవకాశం కల్పించనున్నాయి. అంతర్గత రహదారులు, మురుగునీటి కాల్వలు, వీధిదీపాలు, శ్మశాన వాటికలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ నిధులు ఉపయోగపడతాయి. అయితే ఈ నిధులను కేవలం అభివృద్ధి పనులకే వినియోగించాలని, జీతాలు లేదా కార్యాలయ ఖర్చులకు ఉపయోగించరాదని కేంద్రం స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాలతో పాటు విడుదలైన ఈ నిధులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో నిధుల వినియోగంపై వచ్చిన విమర్శల నేపథ్యంలో కఠిన నిబంధనలు అమలు చేస్తూ, ప్రతి రూపాయి వినియోగంపై ఆడిట్ నిర్వహించాలని కేంద్రం ఆదేశించింది.

## సింగూర్ నుంచి ఘనపూర్ ఆనకట్టకు నీరు విడుదల చేయాలి రైతుల తరఫున ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి డిమాండ్





సందేశం టైమ్స్ పుల్కల్ మండల్ ఏప్రిల్ 1 ప్రతినిధి సంగారెడ్డి జిల్లా మంజీరా పరివాహక ప్రాంతంలో నీటి కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సింగూర్ ప్రాజెక్ట్ నుంచి ఘనపూర్ ఆనకట్టకు నీటిని విడుదల చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకితే సునీత లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామంలో ఎండిపోయిన మంజీరా నది పరిస్థితిని పరిశీలించిన అనంతరం ఆమె నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రెస్‌మీట్ నిర్వహించి రైతుల గోడును వ్యక్తం చేశారు. కనీసం 0.3 టీఎంసీ నీటిని దిగువన ఉన్న ఘనపురం ఆయకట్టు ప్రాంతానికి విడుదల చేసి పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంపల్లి గౌరీశంకర్, యూత్ అధ్యక్షుడు తునుకులపల్లి సంతోష్ రావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రవితేజ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మర్వేల్లి బీసీ కాలనీలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం



సందేశం టైమ్స్, వట్పల్లి, ఏప్రిల్ 1, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం మర్వేల్లి గ్రామంలోని బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ మల్లేశ్వరమ్మ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ఈ పనులు పూర్తయితే కాలనీలో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లేశ్వరమ్మ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ పెద్దగొళ్ల సాయిబాబా, గ్రామ పెద్దలు రాజు పటేల్, వార్డ్ మెంబర్ చిలపల్లి సుప్రియ, మాజీ మెంబర్ మీదుకుందే ఆంజనేయులు, గిరుకలా యాదప్ప, సుకూరి అశోక్, ఎర్రరాం బుమయ్య తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు పనుల ప్రారంభాన్ని స్వాగతిస్తూ వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి వినియోగానికి అందించాలని కోరారు.

## కొత్త చేరుతాండలో సీసీ రోడ్డు ప్రారంభం



సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 01, ప్రతినిధి: మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కొత్త చేరుతాండ గ్రామపంచాయతీలో నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులను నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ఈ పనులు పూర్తయితే గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మూడ్ ధన్ సింగ్, ఉప సర్పంచ్ ఫుల్ సింగ్, వార్డ్ మెంబర్లు ముత్యాలు, కాట్రాత్ గోపాల్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు నూనావత్ శంకర్ నాయక్, గ్రామ పెద్దలు కిషన్, లోక్య, బద్య, కూల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పనుల ప్రారంభాన్ని స్వాగతిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

## నాబార్డ్ వాటర్ షెడ్ ప్రాజెక్ట్ ప్రారంభం – రైతులకు ఊతమని ఎమ్మెల్యే సంజీవరెడ్డి



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 01, ప్రతినిధి: నారాయణఖేడ్ నియోజకవర్గం సిర్గాపూర్ మండలం వసర్ గ్రామంలో నాబార్డ్ సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ షెడ్ ప్రాజెక్ట్ నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపుతో పాటు వ్యవసాయ రంగానికి వాటర్ షెడ్ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. నాబార్డ్ ఆర్థిక సహకారంతో చేపడుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా వసర్ గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల రైతులకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యాలయం ద్వారా ప్రాజెక్ట్ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సహాయం అందిస్తామని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, రైతాంగ సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాబార్డ్ అధికారులు, కృష్ణతేజ, రాధారాణి, నూతన్ కుమార్, చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ హన్మంత్, ఉప సర్పంచ్ విఠల్ రెడ్డి, వివిధ శాఖల నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 1, ప్రతినిధి: నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అర్హులైన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్, శివంపేట మండల పార్టీ అధ్యక్షుడు కొడకంచి సుదర్శన్ గౌడ్ చేతుల మీదుగా ఈ చెక్కులు అందజేశారు. శివంపేట తుక్యతాండకు చెందిన సభావత్ సాలమ్మకు రూ.28,000, చిలపిచెడు మండలం ఫైజాబాద్ గ్రామానికి చెందిన విస్లావత్ దాస్లికి రూ.60,000 చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేద, నిరుపేద కుటుంబాలకు ఆపన్నహస్తంగా నిలుస్తుందని, అత్యవసర పరిస్థితుల్లో ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాచునూరి శ్రీశైలం యాదవ్, రాధాకృష్ణ, కొండి దుర్గేష్, దడిగ నరేష్, సుధీర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ కిషన్ నాయక్, శివాజీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## నశాముక్త్ భారత్ మనందరి కర్తవ్యం: పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి




సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 1, ప్రతినిధి: దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే శారీరకంగా, మానసికంగా దృఢమైన యువత అవసరమని, అందుకోసం యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. నారాయణఖేడ్ జడ్పి హైస్కూల్‌లో బ్రహ్మకుమారి సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన నశాముక్త్ భారత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మాఫియా, మత్తు పదార్థాల ప్రభావం నుంచి విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా ప్రభావానికి లోనుకాకుండా తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తమ లక్ష్య సాధన కోసం విద్యార్థులు నిరంతరం విద్యపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం యాదగిరి, ఉపాధ్యాయులు రాజశేఖర్, లక్ష్మణరావు, చంద్రశేఖర్ ఆచార్య, ధన్‌సింగ్, హమీద్, బ్రహ్మకుమారి సమాజం సభ్యులు లక్ష్మీదీది, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు





సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 1, ప్రతినిధి: మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం వెల్దుర్తి మండలం మాసాయిపేట గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవాలకు కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్, శివంపేట మండల పార్టీ అధ్యక్షుడు కొడకంచి సుదర్శన్ గౌడ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హోమం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి హారతులు సమర్పించారు. అమ్మవారి కృపా కటాక్షాలు నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని వారు ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాచినూరి శ్రీశైలం యాదవ్, రాధాకృష్ణ, కొండి దుర్గేష్, దడిగ నరేష్, సుధీర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ కిషన్ నాయక్, శివాజీ, కుమ్మరి నాగరాజు, బెస్త చిరంజీవి, గౌడ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కలుషితమవుతున్న చెరువు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 01, ప్రతినిధి: పటాన్చెరు పట్టణ కేంద్రంలోని ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని పిఎన్ఆర్ టౌన్షిప్ కాలనీలో డ్రైనేజ్ నీరు మేదర చెరువులోకి చేరడంతో చెరువు తీవ్రంగా కలుషితమవుతోంది. గతంలో ఈ చెరువు నీటిని రైతులు తమ పంట పొలాలకు వినియోగించుకునేవారు, మత్స్యకారులు తమ జీవనోపాధి కోసం ఉపయోగించేవారు. అలాగే చెరువు పరిసరాల్లో పనిచేసే ఇటుక తయారీ కార్మికులు స్నానాలు, ఇతర అవసరాలకు ఈ నీటిని వినియోగించేవారు, పశువులు కూడా తాగునీటిగా ఉపయోగించేవి. ప్రస్తుతం చెరువులో డ్రైనేజ్ నీరు చేరడంతో నీటి నాణ్యత పూర్తిగా దెబ్బతిని చెరువు మూసీ నదిని తలపించేలా మారిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చెరువులోకి కలుషిత నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## శివపార్వతుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మఠం బిక్షపతి



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 01, అందోల్ టౌన్ ప్రతినిధి: అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని జోగినాథ స్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించిన శ్రీ శివపార్వతుల కళ్యాణ మహోత్సవంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ మఠం బిక్షపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తుల రద్దీతో దేవాలయం కిక్కిరిసింది. కార్యక్రమంలో అందోల్ జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ హెచ్ రామగౌడ్, స్థానిక కౌన్సిలర్లు, నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరై భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.



## సీసీ రోడ్డు ప్రారంభించిన మండల అధ్యక్షులు నిమ్మ రమేష్

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 01, అందోల్ టౌన్ ప్రతినిధి: టేక్మాల్ మండలం ఎల్లంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పోగుల వెంకటపురంలో మంత్రి వర్యులు దామోదర్ రాజనర్సింహ గారి ఆదేశాల మేరకు 5 లక్షల MGNREGS నిధులతో సీ.సీ రోడ్డు పనులను ప్రారంభించారు మండల కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మ రమేష్. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పరి మమత, నవీన్, జిల్లా మైనార్టీ సెల్ కాంగ్రెస్ అధ్యక్షులు మాజర్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, ఉప సర్పంచ్ కిషన్, ఏఎంసి డైరెక్టర్ రాజేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు కిష్టయ్య, నరేందర్, శ్రీను, వెంకయ్య, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సందేశం టైమ్స్

రోడ్లపై చెత్త పారబోస్తూ నిర్లక్ష్యం – ప్రజలు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు

సందేశం టైమ్స్, పటాన్చెరు, మార్చి 31, ప్రతినిధి: పటాన్చెరు మండలం ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దవాగు పక్కన విచ్చలవిడిగా చెత్త పారబోసడం వల్ల తీవ్ర దుర్వాసన వ్యాపించి ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చికెన్, మటన్ దుకాణాల వ్యర్థాలు అయిన కోడి ప్రేగులు, తోళ్లు నిర్లక్ష్యంగా పడవేయడం వల్ల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ప్లాస్టిక్ వ్యర్థాలను కూడా పారబోసడంతో ఆవులు వాటిని తిని అనారోగ్యానికి గురవుతున్నాయని, అలాగే మాంస అవశేషాలు తిన్న కుక్కలు వాహనదారులపై దాడులకు పాల్పడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై మున్సిపల్ అధికారులు స్పందించకపోవడం పట్ల కాలనీవాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



## పటాన్చెరు పెద్దవాగు మురికిని శుభ్రం చేసిన అధికారులు

సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 01, పటాన్చెరు టౌన్ ప్రతినిధి వి సాయి: పటాన్చెరు మండల్ ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దవాగు పక్కన చిత్రపడేయడం వల్ల మురికి వాసన ప్రజలకు ఇబ్బంది కలిగించిందని సందేశం టైమ్స్ పత్రికలో ప్రచురించిన వెంటనే, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అక్కడ శుభ్రత పనులను పూర్తి చేశారు. ఈ చర్య స్థానిక ప్రజలకు గట్టి సౌలభ్యాన్ని కలిగించగా, మున్సిపాలిటీ అధికారులు ప్రజల సమస్యలకు తక్షణమే స్పందించే విధంగా వారి కట్టుబాటును ప్రదర్శించారు.



## పటాన్చెరు శాసన సభ్యుడు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి ప్రెస్ మీట్

సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 01, పటాన్చెరు టౌన్ ప్రతినిధి: పటాన్చెరు శాసన సభ్యుడు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి ఇటీవల నిర్వహించిన ప్రెస్ మీట్‌లో, రాజకీయ వ్యతిరేకుల ఆరోపణలను ఘోరంగా ఖండించారు. ఆయన వ్యాఖ్యానంలో, "హరీష్ రావును విమర్శించే స్థాయి నీదా వసూల్ రాజా... అభివృద్ధి నినాదం మాది, అవినీతి చరిత్ర నీది. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బుల్లెట్ దించిన బుద్ధి రాలేదు. మంత్రి కుమార్తె వివాహం ఖర్చుల పేరుతో కోట్ల రూపాయల వసూళ్లు నిజం కాదా... సొంత కుటుంబాన్ని ద్రోహం చేసిన చరిత్ర నీది" అని కఠినంగా తెలిపారు. అలాగే, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని అమ్మడం, ఎన్నికల్లో వ్యక్తిగత లాభాల కోసం భూములు, రేట్లు, బీఫాలు మినహాయించడం, గల్లికో కలెక్షన్ ఏజెంట్ ద్వారా వసూళ్లు చేసుకోవడం వంటి ఆరోపణలను కూడా విరోధించారు.

మరియు గత రెండున్నర సంవత్సరాల వారి వసూల్ చిట్టా, సర్పంచ్ పదవిలో అసమర్థత, ప్రజల భూములను అమ్మడం వంటి అంశాలను వివరించారు. మైనింగ్ కేసులపై, 2012లో పటాన్చెరు మండల్ రెవెన్యూ పరిధిలోని లకడారం గ్రామంలోని సర్వే నంబర్ 738లో క్వారీ కేటాయింపు, 2023లో రాజకీయ కారణాలతో సీజ్ విధించడం, మరియు రీ-సర్వే కోసం రాష్ట్ర హైకోర్టు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తులు చేసిన విషయాలను స్పష్టం చేశారు.

అంతేకాక, పటాన్చెరు రెవెన్యూ పరిధిలోని పోచారం సర్వే నంబర్ 62లో 5 ఎకరాలకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తూ, భూమి గతంలో 1974లో స్వాతంత్ర సమరయోధుడికి కేటాయించబడినదని, 1997–98లో విక్రయాలు జరిగి తమ కుటుంబానికి సంబంధం లేనట్లు చెప్పారు. చివరగా, "మరోసారి ఈ అంశంపై వివాదాస్పద ఆరోపణలు చేస్తే పరువు నష్టం దావా వేయడం జరుగుతుంది" అని హెచ్చరించారు.



## శివపార్వతుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 01, అందోల్ టౌన్ ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని చారిత్రాత్మక జోగినాధ స్వామి దేవాలయంలో అత్యంత వైభవంగా జరిగిన శ్రీ శివపార్వతుల కళ్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా నేడు రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ దామోదర్ రాజనర్సింహ గారు ప్రత్యేకంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మరియు కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, ఆధ్యాత్మిక చింతనతో కూడిన ఇటువంటి శివపార్వతుల కళ్యాణ మహోత్సవాలు అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని భక్తులందరికీ ఆయురారోగ్యాలను, సుఖశాంతులను చేకూర్చాలని, ప్రజలందరికీ ఆ దైవాశీస్సులు ఎల్లప్పుడూ అండగా ఉండాలని ఆకాంక్షించారు. లోకకల్యాణం కోరి నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు మరియు నియోజకవర్గ నలుమూలల నుండి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.




## హుజుర్నగర్ మున్సిపాలిటీ అభివృద్ధికి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచనలు

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 01, ప్రతినిధి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ నూతన పాలకవర్గం హుజుర్నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని, మున్సిపాలిటీ అభివృద్ధికి సక్రమ సహకారం అందించాలని సూచించారు. మంగళవారం 2026–27 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ నిధులను సక్రమంగా వినియోగించి సత్ఫలితాలను రాబట్టే విధంగా పాలక వర్గం కృషి చేయాలని గుర్తు చేశారు. ఈ ఏడాది మున్సిపాలిటీ బడ్జెట్ రూ.33 కోట్లతో రూపొందించబడిందని, వార్డుల సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు యాక్షన్ ప్లాన్ రూపొందించి ముందుకు సాగాలని సూచించారు. త్రాగునీటి, పరిశుభ్రత, రోడ్ల పునరుద్ధరణకు ప్రత్యేక గ్రాంట్లను వినియోగిస్తూ రానున్న వేసవికాలంలో త్రాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని, మోడల్ కాలనీలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని, వీధిలైట్లు ఏర్పాటు చేసి మహిళ భద్రత కల్పించాలని కలెక్టర్ హైలైట్ చేశారు. 99 రోజుల ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికను మార్చి 6 నుండి జూన్ 12 వరకు సమర్థవంతంగా నిర్వహించాలని, మున్సిపల్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు వార్డులు, కాలనీలలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి పట్టణాన్ని పరిశుభ్రంగా, అందంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

## రామస్వామి గుట్ట వద్ద 2,160 ఇందిరమ్మ ఇళ్ల మోడల్ కాలనీ పరిశీలించిన కలెక్టర్



సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 01, ప్రతినిధి: హుజూర్నగర్ నియోజకర్గ కేంద్రంలోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాల్లో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇళ్ల మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. మంగళవారం ఆయన కాలనీ అంతర్గత రోడ్లు, సభాస్థలిని, మొక్కలు నాటడం, హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించి మిగిలి ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హతలేని వారికి జాబితాలో స్థానం లేకూడదని, అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ సిద్ధార్థ్, మిషన్ భగీరథ కరుణాకర్ రెడ్డి, తహసిల్దార్ కవిత మరియు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.